క్లుప్తంగా

78 మంది విద్యార్థులు గైర్హాజరు

కల్వకుర్తి: ఇంటర్ ప్రథమ సంవత్సరం గణితం –1బీ పరీక్షకు 78 మంది విద్యార్థులు గైర్హాజరయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ సురేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని 7 పరీక్షా కేంద్రాలలో 1,154 మంది విద్యార్థులకు గాను 1,076 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని వివరించారు. విద్యార్థులకు పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

ఎన్‌ఆర్‌ఐ చేయూత

ఉప్పునుంతల: మండలంలోని గట్టుకాడిపల్లి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ చల్లా శేఖర్‌రెడ్డి తోడ్పాటునందించాడు. పాఠశాల భవనానికి తలుపులు, కిటికీలను రూ. 2 లక్షలతో కొత్తగా అమర్చారు. అదే విధంగా డిజిటల్ పాఠశాల బోధనకు ప్రొజెక్టర్‌ను అందజేశాడు. విద్యార్థులకు విద్యాబోధన కోసం వలంటీర్‌ను నియమించి నెలకు రూ.10వేల వేతనం సమకూర్చాడు పాఠశాలకు రంగులు వేయించి అందరి మన్ననలు పొందుతున్నాడు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న శేఖర్‌రెడ్డిని గ్రామస్తులు అభినందించారు.

చెంచులకు ఆధార్ నమోదు కేంద్రం

మన్ననూర్: అభయారణ్య భౌరాపూర్ పెంటలో చెంచుల కోసం ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. గతంలో ఆధార్ నమోదు చేసుకోని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని ఆయా గ్రామాలలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు సమీప చెంచు పెంటలు, గూడాలలోని చెంచులకు సమాచారం ఇవ్వాలని ఐటీడీఏ అధికారి సూచించారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా భౌరాపూర్‌లో భ్రమరాంభిక మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉప్పునుంతల: జాతీయ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శివారులో కొనసాగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేపట్టాలని సూచించారు. మస్టర్లను తనిఖీ చేసి పనుల వద్ద కూలీల సమస్యలను తెలుసుకున్నారు. ఎంపీడీఓతోపాటు ఈజీఎస్ టీఏ సుఖజీవన్, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లయ్య పాల్గొన్నారు.

బీమా చెక్కు పంపిణీ

కొల్లాపూర్: కోడేరు మండలం తీగలపల్లి గ్రామానికి చెందిన గొల్ల జనమోని ఈశ్వరమ్మ కుటుంబానికి బీఆర్ఎస్ ద్వారా మంజూరైన బీమా చెక్కును మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అందజేశారు. బుధవారం పట్టణంలోని తన నివాసం వద్ద బాధితురాలి కుమారుడు రేణయ్యకు బీమా చెక్కును ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివారెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నాయకులు ఆంజనేయులు గౌడ్ తదితరులున్నారు.

జర్నలిస్టులకు ఉచిత వైద్యం అందించాలి



మన్ననూర్: అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామంలో అటవీశాఖ చెక్‌పోస్టు ఎదుట కొంత కాలంగా హైదరాబాద్ అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో తక్కువ ఫీజులతో ఈ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నారు. ఈ క్రమంలో జర్నలిస్టులకు ఉచిత వైద్యం అందించాలని కోరుతూ ఉమ్మడి అమ్రాబాద్ మండలంలోని నల్లమల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో అటవీ శాఖ డీఎఫ్ఓ, ఐటీడీఏ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు అధికారి రోహిత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఎఫ్ఆర్ఓ ఆదిత్య, నల్లమల ప్రెస్‌క్లబ్ కన్వీనర్ కొండయ్య, కమిటీ సభ్యులు సైదులు, శ్రీనివాసులు, బాలస్వామి, శ్రీను యాదవ్, ప్రకాష్, అంజన్న, శ్రీనివాసులు, రామస్వామి, ఎల్లస్వామి, వేదాంతం పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ శవం లభ్యం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఘనపురం చెరువు కొల్లాపూర్ రోడ్డుపై బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని మహిళను ఓ వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందిందని ఎస్ఐ సతీష్ తెలిపారు. మహిళ వయస్సు 40 సంవత్సరాలు ఉంటుందని పేర్కొన్నారు. మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. వివరాలకు సెల్: 8712657721, 8712657718 నంబర్లను సంప్రదించాలని ఎస్ఐ సతీష్ కోరారు.

మహిళా ఉద్యోగులకు సన్మానం



మన్ననూరులో..



కల్వకుర్తి మహిళా ఉద్యోగులను సన్మానించిన ఆర్టీసీ ఉద్యోగులు

కందనూలు: నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోనీ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. బుధవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. డీహెచ్‌ఈడబ్ల్యూ జిల్లా కోఆర్డినేటర్ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ కమర్ షాజహాన్ సుల్తానా, ఉమాదేవి, వనిత, ఐసీడీఎస్ ఎస్‌డబ్ల్యూ వేణుగోపాల్, కృష్ణవేణి పాల్గొన్నారు.

కల్వకుర్తి టౌన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కల్వకుర్తి డిపో మేనేజర్ సుభాషిణి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళా దినోత్సవ వేడుకలను ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు యశోదాబాయి, ఉద్యోగులతో కలిసి నిర్వహించారు. ఇటీవల విడుదల అయిన పలు ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ఒక్కో మహిళా రెండు, మూడు ఉద్యోగాలు సాధించటం శుభపరిణామన్నారు. అనంతరం ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్టీసీ మహిళా ఉద్యోగులు, ఇతర విభాగాల ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో బుధవారం మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. డీఎం ఉమాశంకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ మహిమూదాబేగం కేకు కట్ చేశారు. ఆర్టీసీలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులు, సిబ్బందిని సత్కరించారు. విధుల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మహిళలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎంఎఫ్ యాదయ్య, నజీర్, గౌసోద్దీన్, రామయ్య యాదవ్, రాముడు, నజీముద్దీన్ తదితరులున్నారు.

మన్ననూర్: అచ్చంపేట ఆర్టీసీ డిపోలో ఆవరణలో మహిళా దినోత్సవం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కార్మికులంతా ఒక చోట కలుసుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుని గొబ్బెమ్మలు ఆడారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మహిళా దినోత్సవ వేడుక ప్రాధాన్యత వివరించారు. సందర్భంగా డిపో మేనేజర్ మురళి దుర్గప్రసాద్ మహిళా కార్మికులకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్ కవిత, భవానీ, టీఐటూ రత్నమ్మ, మహిళా కార్మికులు విజయలక్ష్మి, ఇందిరమ్మ, జంగమ్మ, యాదమ్మ, అరుంధతి, శోభబాయి, లక్ష్మి, అలివేల, సుల్తానా, సునీత తదితరులు పాల్గొన్నారు.

తాడూరు: మండలంలోని చర్లిటిక్యాల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులను ప్రత్యేకంగా అలంకరించారు. అంగన్‌వాడీ వర్కర్ నిర్మల, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లింగాల: మండలంలోని దారారంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గిరిజ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయొద్దని మహిళలకు సూచించారు. హెచ్‌ఎం కృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

ఉప్పునుంతల: రైతులు విధిగా తమ పశువులకు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని పశువైద్యాధికారి నరేందర్ సూచించారు. బుధవారం మండలంలోని రాయిచెడ్‌లో 193 పశువులు, గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేశామని పేర్కొన్నారు. రైతులు పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని కోరారు.

తాడూరు: మండలంలోని గుంతకోడూరులో 549 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి డా రాజేష్ తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య భద్రతపై అవగాహన



దోమలపెంట: టీఎస్ జెన్‌కో పరిధిలోని శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో నిర్వహిస్తున్న జాతీయ భద్రత వారోత్సవాల్లో భాగంగా బుధవారం కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఇంజినీర్లు, ఉద్యోగులు, కార్మికులకు ఆరోగ్య భద్రతపై యశోద ఆస్పత్రి అత్యవసర శాఖ వైద్యులు డా.రఫీక్ బృందం ఆరోగ్య భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుండెపోటుకు గురైతే సీపీఆర్, బేసిక్ లైఫ్ సపోర్ట్(బీఎల్ఎస్)పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసి చూపించారు. కార్యక్రమంలో సీఈ సూర్యనారాయణరావు, ఎస్ఈ(ఓఅండ్ఎం) ఆదినారాయణ, ఎస్ఈ(సివిల్)రవీంద్రకుమార్, ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీకుమార్‌గౌడ్, ఎస్ఎఫ్ఓ.మల్లికార్జున యశోద ఆస్పత్రి మేనేజర్ ఈరన్న, డా.రవీంద్రబాబు, డీఈలు, ఏఈలు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో నారీశక్తి వందన్



కొల్లాపూర్: నారీ శక్తి వందన్‌లో భాగంగా ప్రధాని నరేంద్రమోడీ ప్రసంగం వీక్షణ కార్యక్రమాన్ని బుధవారం కొల్లాపూర్‌లోని లోటస్ ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ నాయకులు ఏర్పాటుచేశారు. ప్రధాని ప్రసంగం వీక్షించేందుకు పెద్దసంఖ్యలో మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు మాట్లాడుతూ మహిళా అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తోందని వివరించారు. శేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, సందు రమేష్, భీమేష్, సాయికృష్ణగౌడ్, రోజారమణి తదితరులున్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో లయన్స్‌క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం బసవతారకం క్యాన్సర్ వైద్యులు జూలూరు రాజేష్ ఆర్యవైశ్య మహాసభ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణలు ప్రారంభించారు. కల్వకుర్తికి చెందిన పారిశ్రామిక వేత్త చంద్రమౌళి వర్ధంతిని పురస్కరించుకుని జూలూరి రమేశ్‌బాబు కుటుంబ సభ్యుల సహకారంతో 400 మందికి భోజనం అందించారు. శ్రీధర్, మెంబర్ షిప్ కమిటీ చైర్మన్ దుబ్బ కిషన్, రవిగౌడ్, సతీష్ పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి



కొల్లాపూర్: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లకు నిధులు కేటాయించాలని బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకులు డి.శేఖర్, స్వేరో స్టూడెంట్ యూనియన్ నాయకులు బి.దాసులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని బాలికల వసతిగృహాన్ని సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడారు. హాస్టల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

తల్లిదండ్రులకు పసికందు అప్పగింత



అచ్చంపేట రూరల్: పట్టణంలోని లింగాల చౌరస్తాలో మంగళవారం అర్ధరాత్రి ఓ తల్లి నెలలు నిండని పసికందును వదిలి పెట్టి వెళ్లింది. స్థానికులు, ఐసీడీఎస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగాల మండలం ఎర్రపెంటకు చెందిన కొన్ని కుటుంబాలు పట్టణంలోని వెంచర్లలో పనిచేసేందుకు కొన్ని రోజుల కిందట వచ్చారు. మంగళవారం రాత్రి ఓ మహిళ తన కూతురుతో అచ్చంపేట పట్టణానికి వచ్చారు. తన పర్సు కన్పించకపోవడంతో పసికందును అక్కడే వదిలి వెళికారు. ఈ క్రమంలో పసిపాప ఏడుస్తుండటంతో అక్కడే ఉన్న చిరువ్యాపారులు పోలీసులు, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించారు. ఐసీడీఎస్ అధికారులు బాలసదన్‌కు చిన్నారిని చేర్చారు. బుధవారం ఉదయం వివరాలను సేకరించి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించారు.

కాంగ్రెస్‌కు ప్రజలే గుణపాఠం చెబుతారు

అచ్చంపేట రూరల్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలే గుణపాఠం చెబుతారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం భిన్న ప్రకటనలతో తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, 420 హామీలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చకుంటే ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో స్ప్రింక్లర్లు దగ్ధం

లింగాల: మండలంలోని రాయవరం శివారులో షార్ట్ సర్క్యూట్‌తో స్ప్రింక్లర్లు దగ్ధమైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం విద్యుత్ ఎల్టీ లైన్ వైరు తెగి పడి సమీపంలో ఉన్న ఎండగడ్డి అంటుకుంది. రైతులు సలేశ్వరం, లింగస్వామి, శేషయ్య, బాలస్వామి, శివ, అలివేల పొలాల్లో ఉన్న వెయ్యి స్ప్రింక్లర్లు దగ్ధమయ్యాయి. బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు.

ఉద్యోగాలకు ఎంపికైన అక్షయ్ కుమార్‌కు సన్మానం



మన్ననూర్: ఇటీవల ప్రకటించిన గురుకుల పాఠశాలల్లో ఉద్యోగ నియామకాల్లో నాలుగు ఉద్యోగాలకు ఎంపికైన దాసరి అక్షయ్‌కుమార్‌ను అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ బుధవారం సన్మానించారు. అక్షయ్ కుమార్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రహీం, శ్రీనివాసులు నాయకులు మోపతయ్య, వెంకటేశ్వర్లు, నాసరయ్య, వెంకటరమణ, భరత్‌కుమార్, మేరాజ్, మోతీలాల్, బాలయ్య, యశ్వంత్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

వెల్దండ: మండలంలోని గుండాల అంబా రామలింగేశ్వర స్వామి ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించనట్లు ఈఓ ప్రసాద్, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మొత్తం రూ.78,594 లు ఆదాయం వచ్చిందని తెలిపారు. ఉత్సవాలల్లో హుండీని ప్రత్యేకంగా లెక్కిస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

ఉత్సవాలకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని బుధవారం హైదరాబాదులో ఆయన నివాసంలో కలిసి ఆహ్వానించారు. ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఖచ్చితంగా ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నట్లు వారు తెలిపారు.

ప్రజాదీవెన సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

కల్వకుర్తి: మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన పాలమూరు ప్రజాదీవెన సభకు కల్వకుర్తి నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివెళ్లారు. బుధవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి క్యాంపు కార్యాలయం ఎదుట జెండా ఊపి వాహన ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, నాయకులు ఆనంద్, భూపతిరెడ్డి, సంజీవ్ యాదవ్, విజయ్‌కుమార్ రెడ్డి, జంగయ్య యాదవ్, మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, పర్వత్‌రెడ్డి కార్యకర్తలు ఉన్నారు.

కోడేరు: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజా దీవెన, సభకు కాంగ్రెస్ పార్టీ కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్‌కరీం, మేస్త్రీ కురుమయ్య, ఆది దానయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు భారీగా తరలివెళ్లారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను అమలు చేయాలి

కల్వకుర్తిరూరల్: గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమును ఉచితంగా అమలు చేస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయ సమీపంలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం మాట్లాడుతూ మోసపూరితమైన హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఆర్డీఓ శ్రీనుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. మండల అధ్యక్షుడు విజయ్‌గౌడ్, మధు, పుట్ట రాంరెడ్డి, వెంకటయ్య, అర్జున్‌రావు, సత్యానాయక్, సుభాష్, బోజిరెడ్డి, సైదులు, ఖలీల్, శ్రీశైలం, జంగయ్య, చెన్నకేశవులు, గణేష్, కిషోర్‌తో పాటు వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ



లింగాల: మండల కేంద్రంలోనికోదండరామాలయం ఆవరణలో బుధవారం శివమాలధారణ స్వాముల ఇరుముడిని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వాములు కోనేటి వెంకటస్వామి, మాజీ సర్పంచు పర్వతాలు ఆధ్వర్యంలో శివపార్వతులకు అభిషేకాలు, కలశ, పడి పూజలు చేశారు. అనంతరం ఇరుముడిని ఎత్తుకున్న స్వాములు శ్రీశైలం పుణ్యక్షేత్రానికి బయలుదేరి వెళ్లారు.

పండ్లు పంపిణీ

దోమలపెంట: వటువర్లపల్లి దోమలపెంట గ్రామాల మధ్య నల్లమలలో పాదయాత్ర చేస్తున్న శివస్వాములకు రాములమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కె.వెంకటేష్, భాగ్యనగర్ శివదీక్ష సేవ సమితి, హైదరాబాద్‌కు చెందిన కిరణ్ బృందం తాగునీరు, మజ్జిగ, నిమ్మరసం, పండ్లు అందజేశారు. ఎస్ఎల్‌బీసీ పనులు చేస్తున్న జయప్రకాశ్ కంపెనీ ఆధ్వర్యంలో తాగునీటి వసతి కల్పించారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న గ్రామస్తులు



ఆలయంలో యజ్ఞం చేస్తున్న దంపతులు

పెద్దకొత్తపల్లి: దేవల్‌తిరుమలాపూర్‌లోని శివాలయంలో బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో కొనసాగింది. గ్రామంలో పండుగ వాతావరణం సంతరించుకుంది. పురోహితుల మంత్రోచ్ఛరణ మధ్య ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రతాప్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, విజ్ఞయ్య, కృష్ణయ్య, సత్యం, పురోహితులు భవనాచార్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో యజ్ఞాలు

మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ, రామలింగేశ్వర నూతన ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలలో భాగంగా 2వ రోజు ఆర్యవైశ్య దంపతులు యజ్ఞయాగాదులు నిర్వహించారు. ఈ యజ్ఞంలో 50 జంటలు హాజరయ్యారు. పురోహితులు వేదమంత్రాల ఉచ్ఛరణతో యజ్ఞయాగాలను కొనసాగించారు. ప్రతిష్ఠ కోసం తెచ్చిన శివలింగం, పార్వతీ, కన్యకా పరమేశ్వరి, నవగ్రహాలు, నంది, వివిధ రకాల దేవతా మూర్తులను ప్రతిష్ఠించేందుకు ప్రత్యేక పూజలు చేశారు. గురువారం ఉదయం విగ్రహాల ప్రతిష్ఠాపన ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు చంద్రమౌళి తెలిపారు. పురోహితులు శ్రీనివాసులు శర్మ, విజయభాస్కర్, సభ్యులు రాజశేఖర్, సత్యం, సాయిబాబా, కన్నయ్య, శంకర్, కిషోర్ పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



చంద్రబండతండా పాఠశాలలో ఉపాధ్యాయులైన విద్యార్థులు



కోడేరు మండలం ఎత్తం ప్రాథమిక పాఠశాలలో..



చారకొండలో..

పెద్దకొత్తపల్లి: మండలంలోని చంద్రబండతండా ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అధికారులుగా, ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు హెచ్‌ఎం మల్లయ్య బహుమతులు అందజేశారు.

తాడూరు: మండలంలోని మేడిపూర్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. కలెక్టర్‌గా యోగీశ్వర్, డీఈఓగా సంతోషి, ఎంఈఓగా హాసిని, కాంప్లెక్స్ హెచ్‌ఎంగా విజ్ఞేశ్వరి, హెచ్‌ఎంగా నవ్యశ్రీ, 21మంది ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. కార్యక్రమంలో హెచ్ శాయిప్రభ, ఉపాధ్యాయులు జ్యోతి, శ్రీలత, కరుణాకర్, నసీజ్ పాల్గొన్నారు.

కోడేరు: మండలంలోని ఎత్తం ప్రాథమిక పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు అధికారులుగా, ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందజేశారు. హెచ్‌ఎం వినోద్‌కుమార్, ఉపాధ్యాయులు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

చారకొండ: మండల కేంద్రంలో ప్రథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఎంఈఓగా శివసాయి, హెచ్‌ఎంగా మధు, 10 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రధానోపాధ్యాయులు మాధవి, ఉపాధ్యాయులు భూపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ: వ్యక్తికి గాయాలు

బల్మూర్: మండలంలోని పోలిశెట్టిపల్లి స్టేజీ దగ్గర నాగర్‌కర్నూల్ రహదారిపై మంగళవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఒకరికి గాయాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ రేణయ్య తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మంగళికుంటపల్లికి చెందిన జానయ్య అచ్చంపేట నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా పోలిశెట్టిపల్లి దగ్గర గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో జనయ్యకు తీవ్రగాయాలు కాగా 108 అంబులెన్స్‌లో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తమ్ముడు గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఆర్‌డీఓ ఆకస్మిక తనిఖీ

తెలకపల్లి: తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం నాగర్‌కర్నూల్ ఆర్‌డీఓ సురేష్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రెవెన్యూ కార్యాలయ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సమయపాలన పాటించాలన్నారు. ఓటరు లిస్టులో ఉన్న పేర్లను పరిశీలించారు. అనంతరం మండలంలోని జంగమోనిపల్లి, బండపల్లి, బోరబండతండా గ్రామాలను సందర్శించారు. ఆ గ్రామాలలో నూతనంగా ఏర్పాటు చేసుకున్న పోలింగ్ బూతులను పరిశీలించారు. అధికారులకు బూతులలో అన్ని సౌకర్యాలు కల్పించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ పాండునాయక్, నయాబ్ తహసీల్దార్ లక్ష్మన్, ఆర్ఐలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సోమశిలకు ప్రత్యేక బస్సులు

కొల్లాపూర్: శివరాత్రి సందర్భంగా సోమశిలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డీఎం ఉమాశంకర్ తెలిపారు. శివరాత్రి పర్వదినం రోజు ప్రతి 15 నిమిషాలకు సోమశిలకు బస్సు సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. గురు, శుక్ర వారాలు శ్రీశైలానికి కూడా కొల్లాపూర్ నుంచి బస్సులు ఏర్పాటు చేస్తామని వివరించారు.

కాంగ్రెస్‌లో చేరిన ఎంపీపీ

అచ్చంపేట రూరల్: ఎంపీపీ శాంతాబాయి బుధవారం మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఎంపీపీతో పాటు రంగాపూర్ మాజీ సర్పంచు లోక్యానాయక్, తదితరులు బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ చేరగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి మంత్రి, ఎమ్మెల్యే ఆహ్వానించారు.

ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



కొల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఉచితంగా ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధిష్టానం పిలుపుమేరకు బుధవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేశారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా బీరం మాట్లాడుతూ ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తామని చెప్పి, మాటతప్పారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలకు, అమలుచేస్తున్న వాటికి పొంతన లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేవరకు బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. అనంతరం కొల్లాపూర్ ఎంపీపీగా నూతనంగా ఎన్నికైన మాలె రజిత భాస్కర్‌గౌడ్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలేశ్వర్‌రావు, రంగినేని అభిలాష్‌రావు, నరేందర్ రెడ్డి, సురేందర్‌రావు, కట్టా శ్రీనివాసులు, సురేందర్‌గౌడ్, నిరంజన్, శంకర్‌నాయక్, జంబులయ్య, కృష్ణమూర్తి పాల్గొన్నారు.